క్లుప్తంగా

పాస్టర్ల శాంతియుత నిరసన ర్యాలీ



నాగాయలంక: రాజమహేంద్రవరంలో ఇటీవల దైవ ప్రబోధకుడు ప్రవీణ్ పగడాల అనుమానాస్పద స్థితిలో మరణించినందున విచారించి ప్రభుత్వం నిజాలు వెల్లడించాలని డిమాండ్ చేస్తూ మండల కృపా పాస్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం నాగాయలంక ప్రధాన వీధుల్లో శాంతియుత నిరసన ర్యాలీ జరిపారు. తొలుత రేమాలవారిపాలెం వంతెన సెంటర్‌లో పాస్టర్స్ సమావేశమై ప్రవీణ్ క్రైస్తవ్యానికి చేసిన సేవలను కొనియాడారు. మృతి చెందిన ప్రవీణ్‌కు జోహార్‌లు అర్పించి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. అనంతరం అక్కడి నుంచి ప్రధాన మార్గాల్లో నిరసన ర్యాలీ నిర్వహించారు. దోషులను గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని, క్రైస్తవులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఫెడరేషన్ అధ్యక్షుడు మండలి కిరణ్‌కుమార్, శ్యామ్యూల్ ప్రసాద్, లాం థామస్‌రాజు, బాబూరావు, యేసురాజు, గణపేశ్వరం మాజీ సర్పంచ్ దాసి జీవరత్నం, రక్షణ సైన్యం సంస్థ జిల్లా అధికారి (డి.ఓ) మేజర్ తెలగతోటి ప్రసాదరావు, సాల్మన్ డేవిడ్ రాజు, రవికుమార్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

180 మందికి నేత్ర వైద్య పరీక్షలు



ఘంటసాల: ఘంటసాల గోటకం కాలనీలోని ఆర్థిక సమతా మండలి కమ్యూనిటీ హాలులో సోమవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో అవనిగడ్డ బ్రాంచి, రేపల్లెలోని ఫోకస్ కంటి ఆసుపత్రి డాక్టర్ కిషోర్, డాక్టర్ దాస్ పర్యవేక్షణలో ఆప్తోమెట్రిస్టు మేరుగు ప్రవీణ్ 180 మందికి పైగా రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసిన వారికి రేపల్లె ఫోకస్ ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ చిన్నం దానియేలు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపటి ఫ్యాప్టో నిరసన జయప్రదం చేయండి

కూచిపూడి(మొవ్వ): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఫ్యాప్టో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఏప్రిల్ 2వ తేదీన మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కృష్ణా జిల్లా ఫ్యాప్టో చైర్మన్ అంబటిపూడి సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. మండలంలోని కూచిపూడిలో జరిగిన సన్నాహక సమావేశం సోమవారం నిర్వహించారు. ఫ్యాప్టో నాయకులు రవీంద్రబాబు, శ్రీనివాసరావు, మాణిక్యాలరావు, కేఎస్ సోమేశ్వరరావు, సురేష్, రమేష్‌బాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈ నెల రెండో తేదీన నిర్వహించనున్న నిరసన జయప్రదం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు పి. ఇమ్మానుయేల్, డి. చంద్రశేఖర్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు పూర్తయినా ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రధాన సమస్యలు పరిష్కారంలో నిర్లక్ష్య వైఖరి నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల సమైఖ్య పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు.



పెదనలో రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ పెదన ఇన్‌చార్జి ఉప్పాల రాము



ఘంటసాల గోటకం జామియా మసీదులో సందేశం ఇస్తున్న ఇమామ్ అబ్దుల్ గఫార్



నాగాయలంక జుమామసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మత పెద్దలు, ముస్లింలు

రంజాన్ పర్వదినం సందడి



చల్లపల్లిలో మాట్లాడుతున్న పెద్ద మసీదు మత గురువు ఇమామ్



బంటుమిల్లిలో రంజాన్ ప్రార్థనలు

పెడన: మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు సోమవారం ఈద్గాల వద్ద ప్రార్థనలు నిర్వహించారు. పెడన పట్టణంలోని ఆయా మసీద్‌ల నుంచి ర్యాలీగా అల్లాను స్మరించుకుంటూ ఈద్గాలకు చేరుకోగా మరి కొందరు నేరుగా ఆయా ఈద్గాలకు చేరుకున్నారు. పెడన- గుడివాడ జాతీయ రహదారి పక్కన ఈద్గాల వద్ద చిన్న ముఠా, పెద్ద ముఠా వేర్వేరుగా ప్రత్యేకంగా నమాజ్‌లను ఆచరించారు. వారి వారి మత గురువులు రంజాన్ సందేశాన్ని వివరించారు. తొలుత ముస్లింలు కబరస్తాన్‌ల వద్దకు వెళ్లి వారి వారి తల్లిదండ్రుల, బంధువుల పవిత్ర ఆత్మకు శాంతి కలిగి అల్లా వద్దకు చేరాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్ (రాము), పట్టణ అధ్యక్షుడు కర్ణా శ్రీనివాస్, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్‌లతో పాటు పలువురు నాయకులు ముస్లింలతో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రార్థనలు అనంతరం ముస్లింలను ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలియజేశారు. అల్లా ఆశీస్సులు అందరికీ ఉండాలని, అందరిని చల్లగా చూడాలని ఆకాంక్షించారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆయా ఈద్గాలు వద్ద ప్రార్థనలలో పాల్గొని ముస్లింలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గా సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని ముస్లింలకు హామీ ఇచ్చారు.

చల్లపల్లి: రంజాన్ పర్వదినం ముగింపు సందర్భంగా ఈద్ ఉల్ ఫితర్ వేడుకలు చల్లపల్లిలో సోమవారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. తొలుత మచిలీపట్నం రోడ్డులోని మహ్మదీయ(పెద్ద) మసీదు, చల్లపల్లి నారాయణరావునగర్‌లోని గౌసియా (చిన్న) మసీదు, బైపాస్ రోడ్డులోని ఆహీలే అదీస్ మసీదు, లక్ష్మీపురానికి చెందిన వందలాది మంది ముస్లిలు పెద్ద మసీదు వద్దకు చేరుకుని అక్కడి నుంచి శ్రీనగర్‌లోని ఈద్గా వరకు ర్యాలీగా వెళ్లారు. ఈద్గా మైదానంలో ప్రార్థనలో పాల్గొన్నారు. ఖురాన్ గురువు ఇమామ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనాలు చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకన్నారు. పెద్ద మసీదు కమిటీ అధ్యక్షుడు నసీమ్ ఘోరి, మూడు మసీదులకు చెందిన సుమారు 600 మందికిపైగా పిల్లలు, యువకులు, పెద్దలు అధిక పాల్గొన్నారు.

నాగాయలంక: రంజాన్ పర్వదినం సందర్భంగా స్థానిక కృష్ణానది తీరంలోని జామామసీదులో ముస్లిమ్‌లు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేకప్రార్థనలు జరిపారు. మహ్మద్ ప్రవక్త సందేశాలను మసీదు ఇమామ్ అబ్దుల్ సత్తార్ చదివి మత నియమాలను వినిపించారు. గ్రామానికి చెందిన ముస్లింలు మసీదుకు వచ్చి పరస్పరం శుభాకాంక్షలు అందిపుచ్చుకున్నారు. మండల పరిషత్ మాజీ కో ప్షన్ సభ్యుడు, కమిటీ పెద్ద షేక్ అమీర్ జానీ, రహంతుల్లా, పఠాన్ సుభానీ తదిదరులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: రంజాన్ పండుగను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకుని ముస్లింలు సోమవారం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మండలంలోని చినపాండ్రాక, కృత్తివెన్ను గ్రామాలలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పండుగ సందర్భంగా చిన్నా పెద్దా అందరూ నూతన వస్త్రాలు ధరించి సంతోషంగా గడిపారు.

బంటుమిల్లి: స్థానిక ఈద్గా మైదానంలో మజీద్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రంజాన్ ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మజీద్ గురువు హుస్సేన్ రంజాన్ ప్రాముఖ్యతను వివరించి ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని అభినందనలు తెలుపుకున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వక్ఫ్ బోర్డు చట్ట సవరణను నిరసిస్తూ ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ సెంటర్లో మానవహారం నిర్వహించి కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వక్ఫ్ బోర్డు చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు ఎంపీటీసీ ఎండీ కమల్ బాషా, సభ్యులు పలు గ్రామాల ముస్లింలు పాల్గొన్నారు.

గూడూరు: మండలంలో రంజాన్ పర్వదినాన్ని ముస్లిలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు సోమవారం ముగించుకుని రంజాన్ పర్వదినాన్ని జరుపుకున్నారు. ఈద్గాలో, మసీదుల్లో ప్రత్యేక ఈద్ ప్రార్థనలు నిర్వహించారు. గూడూరు ఈద్గాలో హాఫీజ్ షోయబ్ మొహమ్మద్ ఆధ్వర్యంలో ఈద్ ప్రార్థనలు జరిగాయి. ఆకులమన్నాడు, పినగూడూరులంక, షాబ్దుల్లాపాలెం, తరకటూరు, పోలవరం, మల్లవోలు గ్రామాల్లో ఈద్ నమాజ్‌లు ఆచరించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.

ఘంటసాల: స్థానిక గోటకంలోని జామియా మసీదు, ఘంటసాల చిన్న మసీదుల్లో రంజాన్ వేడుకలను ముస్లింలు సోమవారం ఘనంగా నిర్వహించారు. జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం మసీదులో ఇమామ్ అబ్దుల్ గఫార్ ప్రత్యేక సందేశం ఇచ్చారు. మసీదు కమిటీ అధ్యక్షుడు ఎస్‌కే బాషా, ఉపాధ్యక్షుడు మహబూబ్ సుభాని, యువత అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్ పాల్గొన్నారు. ఘంటసాల చిన్న మసీదులో జరిగిన రంజాన్ వేడుకల్లో ఇమామ్ ముహమ్మద్ ఇస్మాయేల్ పండుగ సందేశం ఇచ్చారు. మసీదు ప్రెసిడెంట్ షేక్ జాకీర్, జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసీం, కమిటీ సభ్యులు కాలేషాహ, అనీఫ్, అక్బర్, కమిటీ సభ్యులు, ముస్లింలు పాల్గొన్నారు.



గూడూరు ఈద్గాలో ఈద్ సందేశం ఇస్తున్న హాఫీజ్ షోయబ్ మొహమ్మద్



పెదన ఈద్గా వద్ద చిన్న ముఠా ముస్లింల ప్రార్థనలు



పెడన ఈద్గాలో పెద్ద ముఠా ముస్లింల ప్రార్థనలు

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానం

రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుకింగ్‌ను సద్వినియోగం చేసుకోండి

మచిలీపట్నంటౌన్: భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోదలచిన కక్షిదారులు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్లాట్ బుకింగ్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవలని స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సబ్ రిజిస్ట్రార్-1 కే జగన్‌మోహనరావు కోరారు. ఈ నూతన విధానం వినియోగంపై సోమవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవగాహనా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ క్యూ మేనేజిమెంట్ సిస్టమ్ (డీక్యూఎంఎస్) ద్వారా భూములు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు రానున్న కొద్ది రోజుల్లో కక్షిదారులు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మార్చి 10వ తేదీ నుంచి జిల్లాలోని కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ విధానం అమల్లోకి వచ్చిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలతో ఈ విధానాన్ని ప్రభుత్వం త్వరలోనే రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని 296 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విడతల వారీగా అమలు చేస్తారన్నారు. ఈ విధానంలో కక్షిదారులు వారి రిజిస్ట్రేషన్‌కు ముందుగానే తేదీని ఖరారు చేసుకుంటే దీనికి సంబంధించిన వ్యక్తులు సకాలంలో కార్యాలయానికి చేరుకోవచ్చన్నారు. క్యూలైన్‌లో నిలబడకుండా ఉండటంతో పాటు సమయం ఆదా అవుతుందన్నారు. రిజిస్ట్రేషన్ కూడా నిర్ధారించిన సమయానికే పూర్తవుతుందన్నారు. పారదర్శకంగా, దళారులకు అవకాశం లేకుండా రిజిస్ట్రేషన్ జరుగుతుందన్నారు. ఈ స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఉపయోగాలను కక్షిదారులు రానున్న రోజుల్లో సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సబ్ రిజిస్ట్రార్- 2 కే నాగశ్రీనివాస్, డాక్యుమెంట్ రైటర్లు, రియల్టర్లు, బిల్డర్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ రిజిస్ట్రార్- 1 జగన్‌మోహనరావు

ఆరబెట్టిన మిర్చి మాయం

తోట్లవల్లూరు: కల్లంలో ఆరబెట్టిన మిర్చి పంట అపహరణకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని చాగంటిపాడు శివారు కళ్లంవారిపాలెంకు చెందిన రైతు జొన్నల శివరామకృష్ణారెడ్డి కరకట్ట వెంబడి తన పొలంలో మిర్చిని కోత కోసి కల్లంలో ఆరబెట్టారు. కల్లంలో ఉంచిన మిర్చిని గత శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. మిర్చిని ఎత్తుకుపోయే క్రమంలో సుమారు ఐదు కేజీల వరకు వేరే ప్రదేశంలో పారపబోయటం ఆశ్చర్యం కలిగిస్తోంది. సుమారు క్వింటా వరకు మిర్చిని దొంగలు ఎత్తుకుపోయినట్లు రైతు శివరామకృష్ణారెడ్డి తెలిపారు. అపహరించిన మిర్చి విలువ రూ.15 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఇదే కల్లంలో గత నాలుగైదు రోజుల క్రితం వేరే రైతుకు చెందిన సుమారు 45 కిలోల వరకు మిర్చిని దొంగలు అపహరించినట్లు తెలుస్తోంది. మిర్చి దొంగతనానికి సంభందించి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బాధిత రైతులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. రాత్రి వేళ గస్తీని ముమ్మరం చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చూడాలని రైతులు కోరుతున్నారు.

సలార్‌దాదా నివాసంలో రంజాన్ విందు

హాజరైన పేర్నినాని, కిట్టు, నాయకులు

మచిలీపట్నంటౌన్: రంజాన్ పర్వదినం సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా ఇనగుదురుపేటలోని తన నివాసగృహంలో సోమవారం ప్రేమ పూర్వక విందు ఇచ్చారు. ఈ రంజాన్ విందుకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని), వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), అర్బన్‌బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ గోపిశెట్టి సతీష్, బందరుకోట పీఏసీఎస్ అధ్యక్షుడు బదరీనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు మన్నే శేషారావు, మహమ్మద్ రఫీ, కరార్‌మూసవి తదితరులు హాజరై విందును స్వీకరించారు. పేర్నినాని, కిట్టు సలార్‌దాదా కుటుంబ సభ్యులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



సలార్‌దాదా నివాసంలో రంజాన్ విందుకు హాజరైన పేర్నినాని తదితరులు

ప్రార్థనలకు హాజరుకాని ఎంపీ, మంత్రి

- క్రమం తప్పకుండా వచ్చే ఆనవాయితీ విస్మరణ
- కారణాలపై ఎడతెగని చర్చలు

మచిలీపట్నం టౌన్: రంజాన్ సందర్భంగా నగరంలోని ముస్తాఖాన్‌పేట ఈద్గా వద్ద సోమవారం జరిగిన ముస్లింల ప్రార్థన కార్యక్రమానికి ఎంపీ వల్లభనేని బాలశౌరి, రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రలు హాజరుకాకపోవటం చర్చనీయాంశమైంది. గత చాలా సంవత్సరాలుగా వీరిద్దరూ క్రమం తప్పకుండా ఈద్గా ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపి వారికి పలు హామీలు ఇవ్వటం ఆనవాయితీగా వస్తోంది. అయితే పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వక్ఫ్ సవరణ చట్టంను ఎక్కువ మంది ముస్లింలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో దీనిపై వివరణ ఎలా ఇవ్వాలోననే సందిగ్ధతతో వీరిరువురూ ప్రార్థనలకు హాజరుకాలేదేమో అని పలువురు ముస్లింలు చర్చించుకోవటం గమనార్హం. ఎంపీ బాలశౌరి గత ఏడాది ఏప్రిల్‌లో ఎన్నికల సమయంలో వచ్చిన రంజాన్ ప్రార్థనల్లో పాల్గొని ఈద్గా అభివృద్ధికి రూ.25 లక్షలు ఇస్తామని, అవసరమైతే మరో రూ.25 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని అందువల్లే రాలేదేమో అనే చర్చ కూడా ఇక్కడ ముస్లింల్లో జరిగింది. ప్రార్థనల్లో పాల్గొన్న టీడీపీ, జనసేన నాయకులు వక్ఫ్ బిల్లుకు తమ పార్టీల అగ్ర నాయకులు వ్యతిరేకం అని చెప్పకుండా ముస్లింలకు అండగా ఉంటామని మాటలు ముగించటం విమర్శలకు తావిచ్చింది. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మతీన్ మాత్రం తమ పార్టీ, వైఎస్సార్ సీపీ ఎంపీలు వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకమని పార్లమెంట్‌లో తేల్చిచెప్పారన్నారు. ఈ బిల్లుకు అనుకూలంగా ఓటేయబోమని ఎంపీలు ఇప్పటికే ప్రకటించారన్నారు. కానీ సీఎం చంద్రబాబు ఈ బిల్లుపై ఎలాంటి ప్రకటన చేయకుండా మిన్నకుండటాన్ని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై ఈద్గా వద్ద ఉన్న టీడీపీ, జనసేన నాయకులు మారు మాట్లాడకపోవటం గమనార్హం. ఎన్ని పనులున్నా, అధికారంలో ఉన్నా.. లేకున్నా మంత్రి కొల్లు రవీంద్ర ఈద్గా ప్రార్థనల్లో పాల్గొనేవారని కానీ ఇప్పుడు సోమవారం ప్రార్థనల్లో పాల్గొనకపోవటంపై ముస్లిం ప్రతినిధులు కూడా అనుమానాలు వ్యక్తం చేశారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు నిరసన

ఘంటసాల: ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాలని కోరుతూ ఘంటసాల గోటకం కాలనీలోని జామియా మసీద్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నల్లరిబ్బన్లు ధరించి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోటకం కాలనీలోని మసీదు నుంచి ఘంటసాల బ్యాంకు సెంటర్ వరకు ముస్లింలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పలువురు ముస్లింలు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు వల్ల రంజాన్ పండుగను సంతృప్తి కరంగా జరుపుకోలేక పోతున్నామన్నారు. ఈ బిల్లు వల్ల ముస్లింల హక్కులు, మసీదులు, ఆస్తుల భద్రతకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ముస్లింల మనోభావాలను గౌరవిస్తూ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు బిల్లుకు కూటమి ప్రభుత్వం, ఎంపీలు మద్దతు విరమించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌లను కోరారు. మసీద్ కమిటీ ప్రెసిడెంట్ ఎస్‌కే బాషా, వైస్ ప్రెసిడెంట్ మహబూబ్ సుభాని, ఇమామ్ అబ్దుల్ గఫార్, యూత్ ప్రెసిడెంట్ ఎస్‌కే మస్తాన్ పాల్గొన్నారు.

కోడూరు: వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు ప్రధాన రహదారుల వెంట ర్యాలీ నిర్వహించారు. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకించాలని నినాదాలు చేశారు. అనంతరం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చినగుడుమోటు మసీదులో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించి, ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్‌ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నపెద్దా తేడా లేకుండా ముస్లింలంతా ప్రార్థనల్లో పాల్గొనగా, ప్రతి ఇంటిలో పండుగ శోభ ఉట్టిపడింది. పెదగుడుమోటు, కోడూరు, నరసింహాపురం మసీదుల్లో కూడా రంజాన్ ప్రార్థనలు ఘనంగా జరిగాయి.



ఘంటసాలలో నిరసన తెలుపుతున్న జామియా మసీదు సభ్యులు



కోడూరులో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

చెత్త సంపద కేంద్రం పరిశీలన

గుడ్లవల్లేరు: చెత్త సంపద తయారీ కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయంతో పాటు రైతులకు వానపాముల ఎరువును తయారు చేయటానికి దోహదపడుతున్నాయని డీఎల్పీఓ జి.సంపత్ కుమారి అన్నారు. గుడ్లవల్లేరులోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. చెత్త సేకరణతో తయారయ్యే వానపాముల ఎరువును కొనుగోలు చేసే రైతులకు ఆరోగ్యకరమైన పంటలు పండటమే గాక పంచాయతీకి ఆదాయం లభిస్తోందన్నారు.కార్యదరిజె.నరసింహారావు పాల్గొన్నారు.

గంగాభవానీ జాతరకు పోటెత్తిన భక్తజనం



జాతరలో భక్తుల కోలాహలం

కోడూరు: భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటున్న కోడూరు గంగాభవానీ అమ్మవారి జాతరకు భక్తజనం పోటెత్తారు. వివిధ సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో కోడూరు పురవీధులు కిక్కిరిసాయి. డప్పువాయిద్యాల నడుమ మహిళలు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి భక్తి భావం చాటుకున్నారు. తలపై గండదీపాలు, మెడలో గారెల దండలతో చలువబట్టలపై నడుచుకుంటూ వచ్చి భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, సారె, గాజులను కూడా సమర్పించారు. యువకులు డప్పువాయిద్యాలకు అనుగుణంగా కర్రసాము, వీరతాడుతో విన్యాసాలు చేస్తూ ఆకట్టుకున్నారు. ప్రత్యేక వాహనాలపై ప్రభలు కట్టి ఆలయం చుట్టూ ఊరేగించారు. తల్లులు తమ చిన్నారులను ఉయ్యాలలో వేసి మొక్కులు తీర్చుకున్నారు. పోతురాజు, ధ్వజస్తంభం వద్ద కూడా భక్తులు పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తవాహిని కొనసాగుతూనే ఉంది.



ప్రత్యేక అలంకారంలో గంగాభవానీ అమ్మవారు

ఆకట్టుకున్న అమ్మవారి అలంకారం..

జాతరోత్సవాలను పురస్కరించుకొని గంగాభవానీ అమ్మవారి మూలమూర్తికి చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అమ్మవారిని అలంకరించి, నిమ్మకాయ మాలలను ధరింపజేశారు. ఆలయ ప్రాంగణమంతా శోభయానమానంగా తీర్చిదిద్దారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. క్యూలైన్లు మొత్తం భక్తులతో కిక్కిరిశాయి. మహిళలు తెచ్చిన నైవేద్యాలను పండితులు రాశిగా పోసి అమ్మవారికి నివేదన చేశారు. ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇంటి పన్నుల వసూళ్లను పూర్తి చేయాలి

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో ఇంటి పన్నుల వసూళ్ల కార్యక్రమాన్ని గుడివాడ డీఎల్పీఓ జి.సంపత్‌కుమారి సోమవారం పరిశీలించారు. లక్ష్యానికి మిగిలిన ఇంటి పన్నుల వసూళ్లను వెంటనే పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.విజయసారథి, గ్రామ కార్యదర్శి జె.నరసింహారావు పాల్గొన్నారు.